క్లుప్తంగా

ఉపాధి హామీ పనులపై 27న సామాజిక తనిఖీ

కోదాడరూరల్ : కోదాడ మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై ఈ నెల 27వ తేదీన మండల పరిషత్ కార్యాయలంలో ఉదయం 10: 30 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాంచందర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 16 గ్రామాల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగిన పనులపై ఈ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలంలోని కూలీలు సకాలంలో హాజరై తమ అభ్యంతరాలను తెలపవచ్చని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్‌రూరల్ : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబోయే రాజకీయ, విద్యా వైజ్ఞానిక రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ పిలుపునిచ్చారు. శనివారం హుజూర్‌నగర్ మండలంలోని అమరవరంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు పిన్నపురెడ్డి వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు షేక్ సైదా, మారీ, వెంకటేశ్వర్లు, రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

బీసీలు రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలి

అనంతగిరి : బీసీలు రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ అన్నారు. శనివారం అనంతగిరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీసీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు బచ్చు రాజ్యం పోలంపల్లి సుధాకర్‌గౌడ్, మేక నాగేశ్వరరావు, సతీష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వాలు నమోదు



అమీనాబాద్‌లో సభ్యత్వాలు నమోదు చేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

అనంతగిరి : మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పోలూరి శ్రీనివాసరెడ్డి టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వాలు నమోదు చేశారు. కార్యక్రమాల్లో ఆ సంఘం మండల అధ్యక్షుడు మండవ ఉపేందర్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, బావసింగ్, బాబు, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలని వినతి

కోదాడరూరల్ : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున కోదాడ పట్టణంలో పారిశుద్ధ్య పనులు వెంటనే చేపట్టాలని బీజేపీ జిల్లా నాయకుడు జనార్దాన్ కోరారు. ఈమేరకు కోదాడ మున్సిల్ కార్యాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పట్టణంలోని అనేక ఖాళీ స్థలాలు దోమలు, పందులకు నిలయాలుగా మారాయన్నారు. ఆ స్థలాల్లో చెట్లు, చెత్తను తొలగించాలని కోరారు. పట్టణంలో అన్ని వార్డుల్లో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారిందని, వాటిని శుభ్రం చేసి దోమల మందు పిచికారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఓరుగంటి శ్రీనివాస్, మునగాల శ్రీనివాస్, వెంకటేష్, బాబుయాదవ్, నాగేశ్వరరావు, భాగ్యరాజు, వెంకటేష్ ఉన్నారు.

విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలి

హుజూర్‌నగర్ : విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలని, అప్పుడే అనుకున్న లక్ష్యం చేరుకోగలరని ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ స్రవంతి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానసిక అంశాలు – విద్యార్థులు అనే అంశంపై చర్చా గోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలసమయంలో విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు, వాటికి తగిన పరిష్కారాల గురించి ఆమె వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జానపాటి కృష్ణయ్య, అధ్యాపకులు జి.శ్రీను, బ్రహ్మాచారి, నరసింహారావు, నాగుల్ మీరా, రమేష్, వెంకటరమణరెడ్డి నరసింహారావు, రామమూర్తి, శోభారాణి, రంగ, తిర్మలరావు, నాగమణి పాల్గొన్నారు.

ఆర్లెగూడెంలో వైద్య శిబిరం

చిలుకూరు : మండలంలోని ఆర్లెగూడెం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరం బారిన పడిన వారి నుంచి రక్త నమునాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలో పంచాయతీ సిబ్బంది దోమల మందు పిచికారీ చేశారు. ఎంపీడీఓ గిరిబాబు వైద్య శిబిరాన్ని పరిశీలించి వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, వైద్య, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలమయంగా రహదారులు

- ప్రధాన, అంతర్గత రోడ్లు అధ్వానం
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- కొత్త బీటీ, సీసీ రోడ్లు నిర్మించాలని కోరుతున్న ప్రజలు



గుంతలమయంగా ఉన్న కట్టకమ్ముగూడెం రోడ్డు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని ప్రధాన, అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లు అడుగుడునా గుంతలమయంగా మారండతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మిషన్ భగీరథ పనులు చేసిన సమయంలో పైప్‌లైన్లు వేసేందుకు రోడ్లన్నీ ఇష్టానూసారంగా తవ్వి మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారు. దీంతో గుంతలు నేడు ప్రయాణానికి అడ్డంకిగా మారాయి. ముఖ్యంగా పట్టణంలోని ప్రధాన రహదారులైన అనంతగిరి రోడ్డు, మినీ బైపాస్, ఎల్ఐసీ ఆఫీస్ వీధి, కట్టకమ్ముగూడెం రహదారితో పాటుగా పలు వీధులు అధ్వానంగా ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన సీసీ, బీటీ రోడ్లుగా మార్చి తమ ఇబ్బందులు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



మినీ బైపాస్ రోడ్డు ఇలా..

రోడ్ల పరిస్థితి ఇలా..

పట్టణంలోని అనంతగిరి రోడ్డు వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. 10 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ సీసీ రోడ్డు నయానగర్, అనంతగిరి మండల కేంద్రంతో పాటు 13 గ్రామాల ప్రజలకు ప్రధాన రహదారి. ఈ రోడ్డు మార్గం గుండా నాగార్జున లాడ్జి సెంటర్ నుంచి పబ్లిక్ క్లబ్ మూలమలుపు వరకు రోడ్డుపై గుంతలు పడ్డాయి. ఇక ఎల్ఐసీ ఆఫీస్ వీధి, పాత రిజిస్ట్రేషన్ ఆఫీస్ వీధుల నుంచి కట్టకమ్ముగూడెం రోడ్డును కలిపే సీసీ రోడ్ల పరిస్థితి దయనీయమే. అక్షర స్కూల్ నుంచి జాతీయ రహదారి 65 వరకు ఉన్న కట్టకమ్ముగూడెం బీటీ రోడ్డుపై కూడా పెద్ద గుంతల పడ్డాయి. ఈ రోడ్డులో కూడా చిలుకూరు మండలంలోని ఆరు గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. మరో ప్రధాన రోడ్డు మినీ బైపాస్. ఇది హుజూర్‌నగర్ రోడ్డులోని హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్ నుంచి మేళ్లచెరువు రోడ్డు వరకు ఉన్న బీటీ రోడ్డు. ఇది కూడా అనేక చోట్ల గుంతలమయంగా మారింది.

నూతన రోడ్లు నిర్మించాలి



కోదాడలోని పలు వీధుల్లో రోడ్లు గుంతలమయంగా తయారయ్యాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పడిన రోడ్లను గుర్తించి నూతన రోడ్లు నిర్మించాలి.

– మర్ల చంద్రశేఖర్‌రెడ్డి, కోదాడ

కంకర తేలిన సీసీరోడ్లు..

పట్టణంలో ప్రధాన రోడ్లే కాకుండా నాలుగేళ్ల కిందట గత మున్సిపల్ ఎన్నికలకు ముందు పలు వీధుల్లో నిర్మించిన సీసీ రోడ్లు కూడా కంకర తేలి ధ్వంసమయ్యాయి. రోడ్లు నిర్మించే సమయంలో కాంట్రాక్టర్లు సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే రోడ్లు తక్కువ సమయంలో అధ్వానంగా మారాయని ప్రజలు విమర్శలు చేస్తున్నారు.

అలరించిన కళా ప్రదర్శనలు



కళాకారులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని సాయిబాబా కళ్యాణ మండపంలో రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ జానపద, రంగస్థల పౌరాణిక కళోత్సవాలు శనివారం అలరించాయి. కళాకారులు ప్రదర్శించిన చెక్క భజనలు, బంజారా, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన కళాకారుని చాగంటి సాయి లక్ష్మి ప్రదర్శించిన సత్య హరిశ్చంద్ర కాటి సీన్, సీనియర్ కళాకారులు డి.సత్యనారాయణ బృందం ప్రదర్శించిన మోహిని భస్మాసుర నృత్య నాటిక, వెంపటి కళాకారులు ప్రదర్శించిన చిడితల భజన, లంబాడి సంప్రదాయ నృత్యం, ఏక పాత్రలు పలువురిని అలరించాయి. ఈ సందర్భంగా కళాకారులకు బహుమతులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కళాకారులు చప్పిడి భిక్షం, చెంచు లింగన్న, గుండ్ల ఆంజనేయులు, వీరునాయుడు, డి.సత్యనారాయణ, జె.గోవిందు, ఎం.దామోదరాచార్యులు, కంబాల శ్రీనివాస్, కొట్టు బాబు, వీరబాబు, నాన్‌జి, ఇట్టిమళ్ల వినోద్, భద్రాచలం, మణిదీప్ కళాకారులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేస్తే చర్యలు

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంజన్

సాక్షి ఎఫెక్ట్..



మునగాలలో మందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నిరంజన్

మునగాల : మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు విషజ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతుండడంతో ఈనెల 22వ తేదీన సాక్షి దినపత్రికలో 'గ్రామాలను వణికిస్తున్న విషజ్వరాలు'అనే శీర్షికన వచ్చిన కథనానికి జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి స్పందించారు. వారి ఆదేశాల మేరకు శనివారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.నిరంజన్ నాలుగు బృందాలతో మునగాలలోని పలు ఆర్‌ఎంపీ వైద్యశాలలు, మందుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీ ఆవరణలో విషజ్వరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానాలపై వైద్యారోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్‌ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల కేంద్రంలో పలువురు ఆర్‌ఎంపీ వైద్యులు క్లినిక్‌లలో బెడ్లు ఏర్పాటు చేసి స్టెరాయిడ్స్, అధిక డోస్ యాంటిబయాటిక్ వాడుతున్నట్లు తమ తనిఖీలో తేలిందన్నారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు తమ ఇష్టం వచ్చిన రీతిగా రక్తపరీక్షలు నిర్వహించి డెంగీ, చికున్‌గన్యా, మలేరియా వంటి జ్వరాలు వచ్చాయని తెలిసి తెలియని వైద్యం చేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. పూర్తిస్థాయి నివేదికను జిల్లా వైద్యాధికారి, జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో సౌకర్యాలు సరిగా లేక రోగులకు పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదని, నూతనం భవనాన్ని త్వరలో ప్రారంభిస్తే పూర్తిస్థాయిలో సిబ్బందితో పాటు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయిని వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు డా.పి.రవీందర్, సబ్ యూనిట్ అధికారి సముద్రాల సూరి, ఆరోగ్య విస్తరణాధికారి గజగంటి ప్రభాకర్, హెల్త్ సూపర్‌వైజర్ పసుపులేటి లక్ష్మీనారాయణ, హెల్త్ అసిస్టెంట్లు ఇందిరాల రామకృష్ణ, లింగం రామకృష్ణ, సురేష్, ఆశావర్కర్లు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

కోదాడరూరల్ : మండలంలోని రామలక్ష్మీపురంలో గల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఏ.హనుమంతరావు, బడుగుల సైదులను ఆ గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం డి.వెంకటేశ్వర్లు, హెచ్ఎం లిక్కి శ్రీనివాసరావు, సుజాత, గ్రామస్తులు కొప్పుల సుభాష్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, అంజిరెడ్డి, అన్నెం నరసింహరెడ్డి, సాగర్‌రెడ్డి, జ్యోతిరాణి, వెంకట్‌రెడ్డి, అంగన్‌వాడీలు స్వరాజ్యం, పార్వతమ్మ, లక్ష్మమ్మ, కోటమ్మ ఉన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ మండల కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్ష, కార్యదర్శులను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

చిలుకూరు : బీఆర్‌ఎస్ పార్టీ చిలుకూరు మండల నూతన కార్యవర్గాన్ని మండలంలోని బేతవోలు గ్రామంలో శనివారం పార్టీ నాయకులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బేతవోలు గ్రామానికి చెందిన అక్కినపల్లి జానకీరామాచారి, ప్రధాన కార్యదర్శిగా చిలుకూరుకు చెందిన అంబాల రాంబాబులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులను మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ



నడిగూడెం రైతు వేదికలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏడీఏ యల్లయ్య

నడిగూడెం : అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అవుతుందని కోదాడ ఏడీఏ డి.యల్లయ్య తెలిపారు. నడిగూడెం మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీ కాని రైతుల వద్ద నుంచి దరఖాస్తుల సేకరణ ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం మండల స్థాయి ఎరువుల డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియాను అక్రమంగా పక్క జిల్లాలకు తరలించవద్దన్నారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించవద్దన్నారు. ఎవరైనా అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి దేవ ప్రసాద్, ఏఈఓలు పిచ్చయ్య, ఉప్పయ్య, మౌనిక, రేణుక, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను మంత్రి ఉత్తమ్ పరామర్శ



దేవభిక్షం కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని కిష్టాపురంనకు చెందిన షేక్ మౌలాలి, చింతిర్యాలకు చెందిన చడపంగు దేవభిక్షం ఇటీవల మృతి చెందారు. శనివారం వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మౌలాలి, దేవభిక్షంల మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని అన్నారు. మంత్రి వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎస్.కొండారెడ్డి, నర్సింహామూర్తి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

లింగయ్య సేవలు మరువలేనివి

మోతె : బీఆర్‌ఎస్ పార్టీ మోతె మండల అధ్యక్షుడు శీలం సైదులు తండ్రి శీలం లింగయ్య నర్సింహాపురం గ్రామాభివృద్ధికి, బీఆర్‌ఎస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం మోతె మండలంలోని నర్సింహాపురంలో శీలం లింగయ్య దశదినకర్మకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా లింగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన కుటుంబాన్ని హోదార్చి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు ఆరె లింగారెడ్డి, ఏలూరి వెంకటేశ్వరరావు, మండల నాయకులు, సొసైటీ చైర్మన్లు, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

భజన పోటీలను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్ : పట్టణంలోని సాయిబాబా కళ్యాణ మండపంలో ఆదివారం శ్రీఅన్నమయ్య భజన మండలి సౌజన్యంతో నిర్వహించే భజన పోటీలో కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. శనివారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. అంతరించిపోతున్న సనా తన సాంప్రదాయాలను, హిందూ ధర్మాన్ని బతికించుటలో భాగంగా ఈ భజన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్నమయ్య భజన మండలి గౌరవ అధ్యక్షుడు గుండా సుశీలమ్మ, వ్యవస్థాపక అధ్యక్షుడు బాచిమంచి కొండయ్య, ప్రధాన గాయకులు చప్పిడి భిక్షం, రంగస్థల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి సత్యనారాయణ, కళాకారులు శ్రీనివాస్, పద్మ, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ఖాజా ఎజాజుద్దీన్‌ను గెలిపిద్దాం

కోదాడరూరల్ : యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో జిల్లా అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న ఖాజా ఎజాజుద్దీన్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిద్దామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గుడిబండలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో 18 నుంచి 35 ఏళ్ల వయసు గల ఓటర్లు ఫోన్‌లోని యాప్‌లో ఓటు వేయాలని, వచ్చే నెల 14 వరకు ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, రేవూరి వెంకటాచారి, పీఏసీఎస్ చైర్మన్లు ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, నంబూరి సూర్యం, నాయకులు మందలపు శేషు, తొండపు సతీష్, గద్దల వెంకటేశ్వర్లు, ఎరగాని లక్ష్మయ్య, ఎండీ.రఫీ, నాగిరెడ్డి, తదితరులు ఉన్నారు.

సూపర్ కిడ్ ఉపాసనకు అభినందన



సూపర్ కిడ్ ఉపాసనను అభినందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : రెండున్నర సంవత్సరాల వయస్సులోనే ఇండియా బుక్ ఆఫ్ రికార్డు, అంతర్జాతీయ సూపర్ టాలెంట్ కిడ్ అవార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సాధించిన ఉపాసనను నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యుడు గుండా రామ్మూర్తి మనుమరాలైన ఉపాసన పాఠశాలలో చిన్నారులతో కలిసి నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా స్వాతంత్ర్య సమరయోధులు, దేశ నాయకుల ఫొటోలను చిన్నారి అవలీలగా గుర్తించింది. అనేక రకాల ఫజిల్‌ను పూర్తి చేసింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు, క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, యూసుఫ్, కందిబండ శ్రీనివాస్, రంగారెడ్డి, వీరబాబు, సైదులు, ఖాన్, జానకి, రశీద్, రాములు, అన్నపూర్ణ, నర్సింహారావు, నాగమణి, భానుమతి, మాధవి, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ఆడపిల్లల చదువు దేశ భవిష్యత్‌కు పునాది



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న షేక్ మీరా

మునగాల : ఆడపిల్లల చదువు దేశ ఉజ్వల భవిష్యత్‌కు పునాది అని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి షేక్ మీరా అన్నారు. శనివారం మునగాల మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ మీరా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆలోచన విధానంలో మార్పు రావాలన్నారు. సమాజంలో ఉన్నతస్థాయిలో ఉండే విధంగా భవిష్యత్ కార్యాచరణ ఎంచుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల మీద పెట్టుకున్న ఆశలు, నమ్మకాన్ని, భవిష్యత్ లక్ష్యాన్ని సాధించేందుకు పిల్లలు ఇష్టంతో కష్టపడి చదివి మంచిపేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల దశలో విద్యార్థి అన్ని అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. కస్తూరిబా ఎస్ఓ సునీతారాణి మాట్లాడుతూ పాఠశాల దశలో విద్యార్థులు తీసుకునే నిర్ణయాలే వారి జీవితానికి పునాదుల్లా ఉంటాయన్నారు. బాలభవన్ అధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువులో రాణించి తల్లిదండ్రులకు, గురువులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. విద్యార్థినులకు సేఫ్ టచ్ –అన్ సేఫ్ టచ్‌పై ఈ సదస్సులో వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం జ్యోతి, స్వాతి, విజయనిర్మల, రేణుక, టెసెంబేగం, రజిత, కవిత పాల్గొన్నారు.

పూర్తిస్థాయి నీటి మట్టానికి పులిచింతల ప్రాజెక్టు

హుజూర్‌నగర్ : పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరింది. ప్రాజెక్ట్‌కు శనివారం 29,638 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ఒక క్రస్ట్ గేటును 1.40 మీటర్లు పైకి ఎత్తి స్పిల్‌వే ద్వారా 13,638 క్యూసెక్కుల నీటిని, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 16 వేల క్యూసెక్కులను దిగువన ప్రకాశం బ్యారేజ్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 45.77 టీఎంసీల నీరు ఉంది. పూర్తి రిజర్వాయర్ నీటి మట్టం 53.34 మీటర్లు కాగా ప్రస్తుతం 53.34 మీటర్ల వరకు నీరు ఉంది. ప్రాజెక్టులో 175 అడుగులకు గాను 175 అడుగుల నీరు ఉంది.

104 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి..

పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. శనివారం ఈ కేంద్రంలో నాలుగు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. 16 వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 104 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి తెలంగాణ గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ దేశ్యానాయక్ తెలిపారు.

2, 3 తేదీల్లో స్కూల్ గేమ్స్

చిలుకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వచ్చే నెల 2, 3 తేదీల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండు ఆదినారాయణ తెలిపారు. మండల స్థాయి స్కూల్ గేమ్స్‌పై శనివారం చిలుకూరులోని పాఠశాలలో పీఈటీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2వ తేదీన 14, 17 సంవత్సరాల లోపు బాలురకు, 3వ తేదీన 14, 17 సంవత్సరాల లోపు బాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు సీతారాంరెడ్డి, బ్రహ్మారెడ్డి, ప్రకాశ్, మట్టయ్య, శోభన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గరిడేపల్లి : మండలంలోని కల్మలచెరువు సబ్‌స్టేషన్, గానుగబండ సబ్ స్టేషన్‌లలో కొత్త బ్రేకర్‌లు ఏర్పాటు చేస్తున్నందున ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ నగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలల్లో ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపికలు, శ్రీకృష్ణుడి వేషధారణలో విద్యార్థులు అందరినీ ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

– సాక్షినెట్‌వర్క్



హుజూర్‌నగర్ : శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



మేళ్లచెరువు : ఐడియల్ పాఠశాలలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు



నేరేడుచర్లలోని బీసీ గురుకుల బాలికల పాఠశాలలో..



మోతె : రావిపహాడ్‌లోని ప్రాథమిక పాఠశాలలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు



గరిడేపల్లి : కీతవారిగూడెంలోని సన్‌రైస్ స్కూల్‌లో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



నడిగూడెంలోని శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో..



నడిగూడెం: శ్రీవెంకటేశ్వర టెక్నో స్కూల్‌లో..



మునగాలలోని న్యూప్రజ్ఞ పాఠశాలలో..